సాక్షి తిరుపతి

శుక్రవారం। 3 । జనవరి। 2025



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. - 8లో



సీలింగ్ స్థలంలో భూ'చోళ్లు'

చిల్లకూరు మండలంలోని సీలింగ్ భూములను కొందరు ఆక్రమించుకుని పట్టాదారు పాసు పుస్తకాలను సృష్టించుకున్నారు. - 8లో



పశువులకు గో-ఆధార్

పశువులకు గో-ఆధార్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తిరుపతి జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. - 8లో

న్యూస్‌రీల్

నేడు, రేపు కలెక్టరేట్ వద్ద వలంటీర్ల ధర్నా

తిరుపతి అర్బన్: తమ ఉద్యోగ పరిరక్షణకు వలంటీర్లు కలెక్టరేట్ వద్ద శుక్ర, శనివారాల్లో ధర్నా చేపట్టనున్నట్లు గ్రామ, వార్డు వలంటీర్ల సంఘం గౌరవాధ్యక్షుడు రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోరాటానికి అందరూ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కూటమి సర్కార్ అధికారంలోకి వస్తే వలంటీర్లకు గౌరవ వేతనం రూ.5 వేలు కాదు రూ.10 వేలు ఇస్తామని చెప్పిన నేతలు నేడు మాట తప్పారన్నారు. రాష్ట్రంలో 2.5 లక్షల మంది వలంటీర్లు ఉన్నారని తెలిపారు. వీరందరూ ఉపాధి కోల్పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలతో నిమిత్తం లేకుండా సేవలు అందించిన వలంటీర్ల పోరాటానికి పార్టీలతో సంబంధం లేకుండా అంతా అండగా ఉండాలని ఆయన కోరారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 69,630 మంది స్వామివారిని దర్శించుకోగా 18,965 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.13 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది.

వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతానికి అందరు కృషి చేయాలని పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలస్థాయిలో వ్యక్తిగత, గ్రూప్, ఉపాధ్యాయ విభాగాల నుంచి ప్రథమ స్థానాల్లో నిలిచిన నమూనాల్లో ప్రతి మండలం నుంచి మూడు ఎగ్జిబిట్లు జిల్లాస్థాయి ప్రదర్శనలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కమిటీలు వారికి కేటాయించిన పనులను పూర్తి చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులకు అన్ని సదుపాయల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వందనమయ్యా!

తిరుపతి ఈఎస్‌ఐ ఆస్పత్రి 100 పడకల స్థాయికి పెంపు

- ఫలించిన ఎంపీ మద్దిల గురుమూర్తి కృషి
- రూ.7.44 కోట్లు మంజూరు



ఈఎస్‌ఐ స్థాయి పెంచాలని డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ గురుమూర్తి(ఫైల్)

తిరుపతి అర్బన్: తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కృషి ఎట్టకేలకు ఫలించింది. పట్టువదలని విక్రమార్కుడిలా కేంద్ర ప్రభుత్వంతో చర్చించి తిరుపతి ఈఎస్‌ఐ ఆస్పత్రిని 50 పడకల స్థాయి నుంచి 100 పడకల స్థాయికి తీసుకురావడంతో ఆయన కృషి ఎనలేదని పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఆయన పులికాట్స్ సరస్సు ముఖద్వారం పూడిక తీతకు రూ.కోట్లు మంజూరు చేయించారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించడానికి అనుమతులు సాధించారు. అంతేకాదు తిరుపతి రైల్వేస్టేషన్ రీ మోడల్‌లో భాగంగా డిజైన్ల నుంచి ప్రయాణికుల మెరుగైన సౌకర్యాల కల్పన వరకు ఆయన ప్రత్యేక చొరవ చూపారు. కోవిడ్ సమయానికి ముందు జిల్లాలో పలు రైల్వేస్టేషన్లలో సూపర్ పాస్ట్, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ ఉండేది. కోవిడ్ తర్వాత వాటిని కేంద్రం రద్దు చేసింది. ఇప్పుడు మళ్లీ తిరిగి ఆ స్థానాల్లో ఆ రైళ్లకు స్టాపింగ్ తీసుకొచ్చేలా చర్యలు చేపట్టారు.

ప్రశ్నిస్తూ..సాధిస్తూ..

తిరుపతి ఈఎస్‌ఐ ఆస్పత్రికి 100 పడకల స్థాయి పెంపునకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.7.44 కోట్లు మంజూరు చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా 90 శాతం కాగా రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు కేటాయించనుంది. 2023 ఆగస్టు 18న ఈఎస్‌ఐ ఆస్పత్రిని అప్పటి ఎంపీ మద్దిల గురుమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఉద్యోగులు ఆయనకు ఏకరువు పెట్టారు. ఈ అంశాన్ని ఎంపీ కేంద్రం దృష్టికి ఏడాదిన్నర క్రితమే తీసుకుపోయారు. అక్కడితో సరిపెట్టుకోక పలుసార్లు పార్లమెంట్‌లో ప్రశ్నించారు. 2023 ఆగస్టు నుంచి పట్టువదలకుండా ప్రయత్నాలు చేసి సాధించారు.

సిబ్బంది హర్షం



ఈఎస్‌ఐ సమస్యలపై ఎంపీకి అర్జీ అందజేస్తున్న ఉద్యోగులు(ఫైల్)

తిరుపతి తుడా: రాయలసీమ జిల్లాల్లోని కార్మికులు, ఈఎస్‌ఐ లబ్ధిదారులకు వైద్యసేవలందిస్తున్న తిరుపతిలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిని 50 పడకల నుంచి 100 పడకలను పెంచుతూ రాష్ట్ర క్యాబినెట్ గురువారం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా వైద్యులు, కార్మికులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామ్‌బాబు మీడియాతో మాట్లాడుతూ ఈ ఎస్‌ఐ ఆస్పత్రిని 100 పడకలకు పెంచడం గర్వకారణమన్నారు.



వేట చేయలేక తిరిగి వస్తున్న మత్స్యకారులు



వాతావరణం ఎప్పుడు అనుకూలిస్తుందోనని బోట్ల వద్ద ఎదురుచూస్తున్న మత్స్యకార కుటుంబ సభ్యులు

దక్కని భరోసా..

చిక్కని చేప!

మత్స్యకార కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇటీవల కాలంలో వరుస తుపాన్లతో వేట లేక.. బతుకు సాగక పస్తులతో కాలం నెట్టుకురావాల్సి వస్తోంది. వేట విరామ సమయంలో అందాల్సిన భృతి కూటమి ప్రభుత్వం వచ్చాక అంతకుండా పోయింది. అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని పలువురు మత్స్యకారులు కన్నీటి పర్యంతమవడం పలువురిని కలచి వేస్తోంది.

- వరుస తుపాన్లతో పూర్తిగా నిలిచిన వేట
- నెల రోజులుగా ఇంటి గడపదాటని మత్స్యకారులు
- 30 రోజులుగా పూట గడవక అవస్థలు

జిల్లాలో మత్స్యకారుల వివరాలు

01 సముద్ర తీరం 76 కి.మీ
02 మత్స్యకార గ్రామాలు 36
03 బోట్లు 1,020
04 మత్స్యకారులు 3,647 మంది

వాకాడు: కాలంతో పనిలేకుండా సముద్రంలో వరుస తుపాన్లు సంభవిస్తున్నాయి. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 20 వరకు నెల రోజుల వ్యవధిలోనే నాలుగు సార్లు తుపాన్లు అతలాకుతలం చేశాయి. విపత్తు ఎప్పుడు సంభవించినా ఆ ప్రభావం మొదట పడేది మత్స్యకారులపైనే. వాతావరణశాఖ ప్రకటన వెలువరించగానే వెంటనే అధికారులు మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకూడదని హెచ్చరికలు జారీచేస్తారు. కాలంతో పనిలేకుండా ఏడాదిలో సుమారు 10 నుంచి 15 వరకు ప్రమాద హెచ్చరికలు వెలువడుతుంటాయి. ఇదిగాక వేట విరామం పేరుతో 61 రోజుల పాటు వేట నిషేధాజ్ఞలు జారీ చేస్తుంది. గడిచిన ఏడాదిలో అటు ఇటుగా 132 రోజులపాటు మత్స్యకారులు వేట లేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిగిలిన రోజుల్లో కూడా సముద్రంపై పోరుగాలితో చేపలు దొరక్క పూట గడవక అల్లాడిపోతున్నారు. ఉప్పు కాలవల ద్వారా అరకొరగా సంపాదించిన సొమ్ముతో వేట లేని రోజులకు సర్దుబాటు చేసుకుంటున్నారు.

భృతి..అంతా భ్రాంతి

సముద్ర ఆధారిత గంగపుత్రులకు దక్కాల్సిన వేట నిషేధిత భృతిపై కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. ఎన్నికల ముందు వేట నిషేధ సమయంలో ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.20 వేలు ఇస్తామని చేతులెత్తేసింది. వారికి అందాల్సిన సాయం అందకపోగా ఇప్పట్లో మత్స్యకార భరోసా ఇవ్వలేమంటూ కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది.

మళ్లీ రీ సర్వేనా?

జిల్లాలో ఐదు మత్స్యకార మండలాల పరిధిలో మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. ఏటా నాలుగు వేల మంది వరకు వేట నిషేధిత సమయంలో ఇంటికే పరిమితమయ్యే వారు. ఈ క్రమంలో అధికారులు ఆయా గ్రామాల్లో ప్రత్యక్ష సర్వే జరిపి అర్హులను గుర్తించారు. ఐతే కొత్తగా కొలువు దీరిన కూటమి ప్రభుత్వం మళ్లీ రీ సర్వే అంటూ కాలయాపన చేస్తోంది.

గత ఆరు నెలలుగా..

వేట లేదు.. సాపాటు లేదు అన్నట్టుగా తయారైంది మత్స్యకారుల పరిస్థితి. వరుస తుపాన్లతో గుమ్మం దాటలేక ఇంటికే పరిమితమయ్యారు. సముద్ర తీరంలో బోట్లకు లంగరు వేసి వాతావరణం ఎప్పుడు అనుకూలిస్తుందా..? అనుకునే లోపే మరో తుపాన్ తిప్పేస్తోంది. రోజూ మత్స్యకారులు ఆకాశం వైపు ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. గడిచిన నెల రోజులుగా వేట సక్రమంగా సాగక పూట గడవడమే గగనమైపోతోంది.

గత ప్రభుత్వంలో ఠంఛన్‌గా మత్స్యకార భరోసా, రాయితీలు

2019లో జగన్ ప్రభుత్వం రాగానే మత్స్యకారుల బతుకులు కష్టాల నుంచి ఒడ్డున పడ్డాయి. జిల్లాలో 2019 నుంచి 2023 వరకు క్రమం తప్పకుండా మత్స్యకార భరోసా కింద ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున 3,647 మందికి రూ.3.64 కోట్లు సాయం అందించారు. అలాగే 3,700 బోట్లకు రూ.1.8 కోట్ల డీజిల్ రాయితీతోపాటు, ప్రమాద బీమా, పనిముట్లు రాయితీలను ఠంఛన్‌గా అందించారు.



వేట సామగ్రిని భద్రపరుస్తున్న మత్స్యకారులు



తుపాన్ కారణంగా అల్లకల్లోలంగా కడలి

వేట సాగక పస్తులు

ప్రస్తుతం మత్స్యకారులు చేపలు దొరక్క, భృతి అందక నానాఅవస్థలు పడుతున్నారు. సాధారణంగా వేట విరామం తరువాత సముద్రంలో మత్స్యసంపద ఎక్కువగా దొరికేది. అలాంటిది గత ఆరు నెలలుగా నిరాశే మిగులుతోంది. వాతావరణం అనుకూలించకపోవడంతో అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. సాధారణ రోజుల్లో సైతం సముద్రంపై పోరు గాలికి బోట్లు తిరగబడుతున్నాయి. వేటకు వెళ్లిన సమయంలో పడవలు ఒకచోట నిలవక మత్స్యకారులు వేట సాగించలేకపోతున్నారు. దీంతో ఉన్న కాస్త మత్స్యసంపద చెల్లా చెదురై పోతోంది. శ్రమతోపాటు, డీజిల్ ఖర్చులు కూడా రావడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారు.

కనికరం లేదా?



వరుస తుపాన్లు సంభవిస్తున్నాయి. నెల రోజులుగా వేట పూర్తిగా ఆగిపోయింది. వేట తప్ప మరేపని తెలియని మేమంతా పూట గడవక ఆకలితో అలమటిస్తున్నాం. కూటమి ప్రభుత్వానికి కనికరం కూడా లేకుండా పోయింది. భృతి ఇస్తామని చెప్పి మోసం చేసింది. భృతి కోసం ఆరు నెలలుగా ఎదురు చూస్తున్నాం.

– కే.సోమయ్య, మత్స్యకారుడు, తూపిలిపాళెం

పస్తులతో అలమటిస్తున్నాం



మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా వరుస తుపాన్లతో మత్స్యకారుల జీవనం మరింత దుర్భరంగా మారింది. ప్రభుత్వం నుంచి మత్స్యకారులకు అందాల్సిన వేట విరామం నగదు ఇంత వరకు అందలేదు. అధికారులను అడిగితే ఏదో ఒక కుంటి సాకులు చెప్పి మాట దాటేసి వెళ్లిపోతున్నారు.

– కృష్ణ, మత్స్యకారుడు, తూపిలిపాళెం

మత్స్యకార భరోసా లేనట్లే



విపత్కర పరిస్థితుల్లో కూడా కూటమి ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవడం లేదు. సంప్రదాయ మత్స్యకారులు గత 30 రోజులుగా వేట లేక, పూట గడవక పస్తులుంటున్న సంగతి సంబంధిత అధికారులకు తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. – మునస్వామి, మత్స్యకారుడు, లైట్‌హౌస్

కడలిని నమ్ముకుని జీవిస్తున్నాం



40 ఏళ్లుగా కడలిని నమ్ముకుని జీవిస్తున్నాం. అలాంటి కడలిపై నెల రోజులుగా వరుస అల్పపీడనాలు, వాయుగుండాలు, తుపాన్లు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయ మందక, వేట సాగక నానా అగచాట్లు పడుతున్నాం. అప్పులు చేసి కుటుంబాలను పోషిస్తున్నాం.

– పోలయ్య, మత్స్యకారుడు, కొండూరుపాళెం

నోటుతోనే పని

వారికి నిబంధనలు అడ్డురావు.. అక్రమాలను ఆపాల్సిన అధికారులు అడ్డు చెప్పలేరు..ప్రశ్నించే వారు ఎదురు పడరు.. ఇంకేముంది అనుకున్నట్టుగానే సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థులను పిండుకుంటున్నారు. రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు.. అవినీతిపరులను వర్సిటీలో మరో విభాగానికి బదిలీ చేసినా సిఫార్సు లేఖలతో మళ్లీ అక్కడే తిష్ట వేస్తున్నారు. ప్రతిదీ నోటుతోనే పని.. లేదంటే లేదు. ఎస్వీయూ పరీక్షల విభాగం కేంద్రంగా పెద్ద కథే నడుపుతున్నారు.





చేయి తడిపితేనే... చేతికందేది!

- ఎస్వీయూలో అవినీతి పరుల హల్‌చల్
- విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టాలతోపాటు ప్రతి సర్టిఫికెట్‌కూ ఓ ధర
- సుదూర ప్రాంతాల విద్యార్థులే టార్గెట్
- అక్కడ పోస్టింగ్ కోసం అధికారులపై ఒత్తిడి

తిరుపతి సిటీ: రాయలసీమకే తలమానికంగా నిలిచిన ఎస్వీయూలో అవినీతి పరులు హల్‌చల్ చేస్తున్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్సిటీలో ఎంతో మంది ఉద్యోగులు ఉన్నత లక్ష్యంతో వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. కానీ కొందరు మాత్రం తమ స్వార్థం కోసం వర్సిటీకి మచ్చతెచ్చేలా నడుచుకోవడం విమర్శలకు తావిస్తోంది.

అక్కడ ప్రతి పోస్టూ హాట్ సీటే...

ఎగ్జామినేషన్ సెక్షన్‌లో ప్రతి పోస్టు హాట్ సీటుతో సమానమే. ఆ విభాగంలో పోస్టింగ్ కోసం అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలతోపాటు ఎమ్మెల్యే, మంత్రి స్థాయి వరకు పైరవీలు నడుపుతున్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు శక్తికి మించి ప్రయత్నాలను ముమ్మరం చేయడం పరిపాటిగా మారింది. గత ఏడాది వర్సిటీ అంతర్‌బదిలీల సందర్భంలో తమను పరీక్షా విభాగం నుంచి బదిలీ చేయకుండా ఆపేందుకు కొందరు, తమను ఎగ్జామినేషన్ సెక్షన్‌కు బదిలీ చేయాలని మరికొందరు ఉద్యోగులు అధికారులపై తెచ్చిన ఒత్తిడి వర్ణనాతీతం. పోస్టింగ్ కోసం వెయ్యికి మించి ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు అధికారులకు చేరాయంటే ఒత్తిడి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి ధ్రువపత్రానికి రూ.వేలల్లో విద్యార్థుల నుంచి వసూలు చేయడమే లక్ష్యంగా ఆ విభాగంలో కొంతమంది సిబ్బంది విధులు నిర్వహించడం గమనార్హం.

ప్రధాన విభాగాల్లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు కలెక్షన్ కింగ్‌లా వ్యవహరిస్తూ విద్యార్థుల నుంచి రూ.వేలకు వేలు వసూలు చేస్తూ జీతాలతో పనిలేకుండా రూ.కోట్లకు పడగలెత్తారని వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.


అవసరం ఆధారంగా ధర నిర్ణయం

డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు కాన్విటేషన్ కోసం, ప్రొవిజినల్ సర్టిఫికెట్ల కోసం వర్సిటీ చుట్టూ తిరుగుతుంటారు. ఇదే కొందరి సిబ్బందికి సిరుల పంటగా మారింది. ప్రధానంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులను టార్గెట్ చేస్తారు. వారికి ధ్రువపత్రం కావాలంటే వారి అవసరాన్ని పసిగట్టి వారంలోపు ఇవ్వాలంటే ఒకరేటు, మూడు రోజుల్లో ఇవ్వాలంటే మరో రేటు నిర్ణయించి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. వర్సిటీలోని పరిపాలనా భవనంలో ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళ్లినా ఇదే తంతు కనిపిస్తోంది. అక్కడ బేరసారాలు జరిగిన తర్వాతే ఎగ్జామినేషన్ సెక్షన్‌లో మిగిలిన ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పైగా వసూలు చేస్తున్నారంటే నమ్మలేని నిజమని అక్కడ పనిచేస్తున్న తోటి ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. రోజుకు కనీసం రూ.10 వేలు ఆదాయం లేనిదే సీటు నుంచి కొంతమంది సిబ్బంది కదిలే పరిస్థితి ఉండదని ఏకంగా ఎగ్జామినేషన్ సెక్షన్లో నిజాయితీగా పనిచేసే ఉద్యోగులే కొందరు చెబుతుండడం ఆశ్చర్యం.

త్వరలో విద్యార్థుల చెంతకే సర్టిఫికెట్లు!

అవినీతి పరులకు చెక్ పెట్టేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. త్వరలో ఆన్‌లైన్ విధానం అమలులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రక్రియ ప్రారంభమైంది. కొందరు ఉద్యోగులు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసి దోచుకోవడానికి అడ్డుకట్ట వేసేందుకు ఆన్‌లైన్ విధానం అమలు కాబోతోంది. ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లోనే అందించే ప్రక్రియకు వర్సిటీ శ్రీకారం చుట్టనుంది. ఈ ఏడాదిలోనే ఈ ప్రక్రియ ప్రారంభ కానున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రక్షాళన ప్రారంభించాం.. త్వరలో అడ్డుకట్ట వేస్తాం



ఎస్వీయూ పేరు ప్రతిష్టలను దెబ్బ తీసేలా ప్రయత్నిస్తున్న కొందరు ఉద్యోగుల వికృత చేష్టలకు త్వరలోనే అడ్డుకట్ట వేస్తాం. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోబోతున్నాం. ప్రతి ధ్రువపత్రాన్ని డిజిలాకర్‌లో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ మేరకు ప్రక్రియ ప్రాంభించేందుకు ముందడుగు వేస్తున్నాం. అవసరమైన సర్టిఫికెట్‌ను విద్యార్థి చెంతకు ఆన్‌లైన్ ద్వారా అందించనున్నాం. ఎగ్జామినేషన్ సెక్షన్‌ను ప్రక్షాళన చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కొందరు అధికారులపై ఒత్తిడి తెచ్చినా పట్టించుకోకుండా వర్సిటీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నాం.

– ప్రొఫెసర్ భూపతినాయుడు, రిజిస్ట్రార్, ఎస్వీయూ

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఉద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ తిరుపతి నగర అధ్యక్షుడు సురేష్‌బాబు నేతృత్వంలో కలెక్టర్ చేతుల మీదుగా టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు బాలాజీ, శ్రీనివాసులు, రఘు, హిమగిరి రమణ ప్రసాద్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 9 గంటలపాటు విద్యుత్ సరఫరా బంద్

తిరుపతి రూరల్: రేణిగుంట 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా పాడిపేట సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదని ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బ్రాహ్మణపట్టు, పాడిపేట హౌసింగ్ కాలనీ, శేషాద్రి నగర్, కొత్తూరు, విప్పమాను పట్టెడ, హరిజనవాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. సరఫరా అంతరాయానికి వినియోగదారుల సహకరించాలని కోరారు.

మూడిళ్లలో చోరీ


దొరవారిసత్రం: మండలంలోని కష్టాపురం ఎస్టీ కాలనీలో బుధవారం రాత్రి మూడిళ్లలో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కృష్ణాపురం ఎస్టీ కాలనీకి చెందిన నాగరాజు, కనకరాజు, సుందరయ్య ఇళ్లకు తాళాలు వేసి, సొంతపని నిమిత్తం బుధవారం సాయంత్రం సూళ్లూరుపేటకు వెళ్లి తిరిగి గురువారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇళ్ల తలుపుల తాళాలు తీసి ఉండగా గుర్తించి, ఇళ్లలోకి వెళ్లి పరిశీలించగా బీరువాలు తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. నాగరాజుకు చెందిన ఇంట్లో నగదు, బంగారు కమ్మలు చోరీ జరిగాయి. మిగిలిన ఇళ్లలో ఎలాంటి వస్తువులు పోలేదు. బాధితులు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దొరవారిసత్రం: నెలబల్లి సమీపంలోని డౌన్‌లైన్ పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండగా స్థానికులు గుర్తించారు. ఈ సమాచారాన్ని రైల్వే పోలీసులకు అందజేశారు. విషయం తెలుసుకున్న సూళ్లూరుపేట జీఆర్పీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి 35–40 ఏళ్ల మధ్య వయస్సు కలిగి పింక్ కలర్ షర్ట్, వైట్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసుల తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వివరాలు తెలియరావాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ చెన్నకేశవ తెలిపారు.

తిరుమలలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

తిరుపతి క్రైం: మద్యం సేవించి తిరుమలకు వాహనాల్లో వెళ్లిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేసినట్లు తిరుమల ట్రాఫిక్ సీఐ హరి తెలిపారు. సీఐ కథనం మేరకు.. తిరుమలలోని జీఎన్‌సీ టోల్‌గేట్ వద్ద బుధవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఏపీ 39 వీసీ 7109, ఏపీ 10 టీవీ1522 సుమోల డ్రైవర్లు అతిగా మద్యం తాగి తిరుమలకొచ్చారు. పోలీసులు బ్రీత్ అనలైజర్ ద్వారా వాహనచోదకులు మద్యం తాగినట్టు గుర్తించి, వారిపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు.



సీలింగ్ స్థలంలో భూ–చోళ్లు

- నలుగురు తహసీల్దార్లు కాదన్నారు!
- ముడుపులు పుచ్చుకుని ఓకే చేసిన ప్రస్తుత తహసీల్దార్
- అధికారికి కూటమి ప్రజాప్రతినిధి అండ
- 15 ఎకరాలు కట్టబెట్టేందుకు స్కెచ్

అడిగేవారు లేరని.. అడ్డుకునేవారు రారని.. సీలింగ్ భూములను ఆక్రమించారు. వాటిని కొనుగోలు చేసినట్టు నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి..సొంతం చేసుకుని, కంచె వేసి, జామాయిల్ సాగు చేశారు. ఈ తతంగమంతా దశాబ్దాల కిందట జరిగింది. ఇందుకు పాసు పుస్తకాల కోసం రెవెన్యూ అధికారులకు ముడుపుల ఆశ చూపారు. సీలింగ్ భూములకు పాసుపుస్తకాలు జారీ చేయకూడదన్న నిబంధనలతో నలుగురు తహసీల్దార్లు తోసిపుచ్చారు. వాటిని తోసిరాజని పని కానిచ్చేశారు ప్రస్తుత రెవెన్యూ అధికారులు. ఇదీ చిల్లకూరు మండలంలోని బూదనం టోల్ ప్లాజా సమీపంలోని సీలింగ్ భూముల కథ.

సాక్షి టాస్క్‌ఫోర్స్: చెన్నై– కోల్‌కత్తా జాతీయ రహదారి వెంబడి తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలో భూములు రూ.కోట్లు పలుకుతున్నాయి. ఇక్కడ పట్టా భూములు తక్కువగా ఉండగా ఎక్కువ భాగం ప్రభుత్వ భూములు ఉన్నాయి. వీటి ధరలు రూ.కోట్లలో పలుకుతున్నాయి. వీటిపై కన్నేసిన కొంతమంది వాటిని సొంతం చేసుకునేందుకు బరి తెగిస్తున్నారు. ఇందులో భాగంగానే కడివేడు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను సొంతం చేసుకునేందుకు అధికారులకు భారీ స్థాయిలో ముడుపులు చెల్లిస్తున్నారు. దీనికి అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధి అండదండలు పుష్కలంగా ఉండడంతో వారికి అడ్డు అదుపు లేకుండా పోతుంది.

కడివేడు రెవెన్యూలో..

జాతీయ రహదారి పక్కనే బూదనం టోల్ ప్లాజాకు సమీపంలో ఉన్న సర్వే నంబర్ 876లో 192 ఎకరాల భూమిని సీలింగ్ చట్టం వచ్చిన తరువాత యజమానులు ప్రభుత్వానికి సరెండర్ చేశారు. ఇందులో 15 ఎకరాల భూమిని 1998లో కొనుగోలు చేసినట్లు తప్పడు పత్రాలతో గూడూరుకు చెందిన ఓ కుటుంబం సొంతం చేసుకునేందుకు సిద్ధం అయ్యింది. అప్పట్లో ఉన్న తహసీల్దార్ల వద్దకు కొనుగోలు పత్రాలను తీసుకుని వెళ్లి పట్టాదారు పుస్తకాలు మంజూరు చేయాలని కోరగా తిరస్కరించారు. దీంతో అప్పట్లో ఇద్దరు తహసీల్దార్లు వీరికిససేమిరా అనడంతో మరోసారి 2017లో అప్పటి తహసీల్దార్ రమణయ్యను పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరారు. దీంతో ఆయన క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, సీలింగ్ భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం కుదరదని చెప్పారు. అటు తరువాత మరోసారి 2022లో తహసీల్దార్‌గా పని చేసిన స్వర్ణ వద్ద పాసుపుస్తకాలు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆమె రికార్డులు పరిశీలించి అన్‌రిజిస్టర్డ్ అగ్రిమెంటు కావడంతో పట్టాదారుల పాస్ పుస్తకాలు ఇవ్వడం కుదరదని 30 రోజుల్లో గూడూరు ఆర్డీఓకు అప్పీల్ చేసుకోవచ్చని ఆదేశాలు జారీ చేశారు. అయితే భూమిని ఆక్రమించుకున్న వారు ఇక వీటి విషయం పట్టించుకోకుండా ఉండిపోయారు. ఈ క్రమంలోనే ఏడాది తరువాత చిల్లకూరు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులతో పనులు చక్కబెట్టుకునే క్రమంలో భారీ స్థాయిలో ముడుపులు అందించి, తహసీల్దార్ స్వర్ణ ఇచ్చిన ఉత్తర్వులపై ఆర్డీఓ కిరణ్‌కుమార్ వద్దకు అప్పీల్‌కు వెళ్లారు. అయితే అప్పీల్ విచారణను అప్పటికే ప్రభుత్వం డీఆర్‌ఓకు ఇచ్చి ఉన్నారు. అయినా ఆర్డీఓ కొత్తగా రాత పూర్వక ఆదేశాలు జారీ చేస్తూ చిల్లకూరు తహసీల్దార్‌ను పనులు చక్కబెట్టమన్నారు. దీంతో ఆయన భారీస్థాయిలో ముడుపులు అందుకుని, పనులు పూర్తి చేసేందుకు సిద్ధం అయ్యారు.

ఎక్కడ పని చేసినా ధనార్జనే ధ్యేయం

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన శ్రీనివాసులు, తహసీల్దార్లు లేని కార్యాలయాల్లో పోస్టింగ్ వేయించుకుని ఎఫ్ఏసీగా పని చేస్తూ ప్రభుత్వ భూములను కట్టబెట్టేందుకు భారీ స్థాయిలో ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అందులో జిల్లా అధికారులతోపాటు ప్రజాప్రతినిధులకు వాటాలు ఇస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

అధికార పార్టీ అండతోనే..

ప్రభుత్వం మారిన తరువాత జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా తహసీల్దార్ శ్రీనివాసులకు చిల్లకూరు మండలం నుంచి బదిలీ ఆదేశాలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన వారికి పనులు చేసేందుకు నమ్మకస్తుడు కావాల్సి ఉండడంతో ఈయనను ఎంపిక చేసుకున్నారు. దీంతో నాలుగు నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులకు బాస్‌గా వ్యవహరించే వ్యక్తితో పాటుగా స్థానిక ప్రజా ప్రతినిధి పూర్తి అండదండలతో చిల్లకూరు మండలంలోనే కొనసాగుతున్నారు. ఇందుకు గాను వారితో పాటుగా వారి అనుచరులకు ప్రభుత్వ భూములను ధారాదత్తం చేసే పనిలో ఉన్నారు. ఈ విషయమై గూడూరు సబ్ కలెక్టర్‌ను ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

అందరూ కీలకమే

సీలింగ్ భూములను కట్టబెట్టడంలో భారీస్థాయిలో ముడుపులు అందడంతో పాటు అధికార పార్టీ పెద్దలు భరోసా ఇవ్వడంతో కింద స్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు కీలకంగా పని చేశారు. గతంలో ఇదే రెవెన్యూలో పని చేసిన వీఆర్వో బాలాజీ అప్పట్లో ఇక్కడ భూములు సీలింగ్ లేదని, రాత పూర్వకంగా నివేదికలు ఇచ్చి ఉన్నారు. ప్రస్తుతం మరోసారి కడివేడు రెవెన్యూలోనే విధులు నిర్వహిస్తున్న వీఆర్వో సీలింగ్ భూములు ఆక్రమించుకున్న వారి స్వాధీనంలోనే ఉన్నట్లు రాసి నివేదికలు ఇవ్వడం విశేషం. దీన్ని ఆర్ఐగా పనిచేస్తున్న యువతికి ఇవ్వగా ఆమె ఆ నివేదికలను తిరస్కరించడంతో అధికారంలోకి వచ్చిన ప్రజాప్రతినిధి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. దీంతో ఆమె ఒక నెల పాటు సెలవు పెట్టుకుని ఇక్కడ నుంచి బదిలీపై వెళ్లి పోయారు. ఆ తరువాత ఆ ఫైల్‌పై నేరుగా తహసీల్దార్ సంతకం చేసి, ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతోనే గూడూరు ఆర్డీఓగా పని చేసిన కిరణ్‌కుమార్ కూడా వీరికి అండగా నిలవడంతోనే పనులు సాగినట్లు సమాచారం.

గని కార్మికులు.. పండుగ పూటా పస్తులే


మాట్లాడుతున్న పాటేళ్ల శిరీష

సైదాపురం: మండలంలోని గని కార్మికులకు ఈ ఏడాది సంక్రాంతి పండుగ కూడా జరుపుకునే పరిస్థితులు లేవని, ఆ రోజూ పస్తులుండాల్సిన స్థితి నెలకొందని రాష్ట్ర సంగీత, నృత్య అకాడమి మాజీ చైర్మన్ పాటేళ్ల శిరీష పేర్కొన్నారు. మండల కేంద్రమైన సైదాపురంలో గురువారం ఆమె విలేకరులతో మట్లాడుతూ సైదాపురం మండలంలో ఏడు నెలలుగా స్వార్థపరుల కోసమే మైకా గనులన్నీ మూసివేశారన్నారు. అప్పటి నుంచి గని కార్మికులకు పనులు, వ్యాపారాలు లేక ఈ ఏడాది సంక్రాంతి పండుగ కూడా జరుపుకునే పరిస్థితులు కనిపించడంలేదని ఆరోపించారు. మండలంలో మొత్తం 60 మైకా గనులుండగా 24 మైకా గనులు మాత్రమే నిర్వహణ కొనసాగుతున్నట్లు తెలిపారు. దీంతో కార్మికుల కుటుంబాల పోషణ, ఫైనాన్స్‌లో తెచ్చుకున్న వాహనాలకు నెలనెలా ఈఎంఐ చెల్లించలేక చాలామంది వాహన యజమానులు అవస్థలు పడుతున్నట్లు ఆరోపించారు. నెల్లూరు నుంచి కొందరు వచ్చి సైదాపురం మండలంలో బెదిరింపులకు దిగితే చూస్తు ఊరుకోరన్నారు. ఎన్నో ఏళ్లగా లీగల్‌గా వ్యాపారం చేస్తున్న వెంకటగిరి రాజాల మైనింగ్ కళ్యాణ్‌రామ్ మైకా మైన్స్, జింపెక్స్ మైన్లను మాత్రం ఓపెన్ చేయడం లేదని ఆరోపించారు. ఆ మైన్‌లు ఎందుకు ఓపెన్‌కు చేయకూడదోనని సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నా వారి వద్ద నుంచి సరైన సమాధానం రావడంలేదన్నారు.

ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల: వేంకటేశ్వరస్వామి భక్తుడు కుప్పలు గిరిధర్‌కుమార్ టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి ప్రాణదాన ట్రస్టుకు రూ.పది లక్షల విరాళం అందజేశారు. బుధవారం ఈ డీడీని తిరుమల క్యాంపు కార్యాలయంలో అదనపు ఈఓ వెంకయ్య చౌదరికి అందజేశారు.

పశువులకు గో–ఆధార్

- పైలెట్ ప్రాజెక్టుగా తిరుపతి జిల్లా

చంద్రగిరి: దేశంలోనే ఎక్కడా లేని తరహాలో పశువులకు గో–ఆధార్‌ను రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుంది. ఈ మేరకు తిరుపతి జిల్లాను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. ఈ మేరకు గురువారం చంద్రగిరి మండలంలోని నారావారిపల్లిలో జరుగుతున్న నమోదును అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకపై పశువులకు గో–ఆధార్ గుర్తింపు కార్డులను ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన యాప్‌ను ఇప్పటికే రూపొందించామని, యాప్ పనితీరును పరిశీలిచేందుకు ప్రభుత్వం తిరుపతి జిల్లాను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. గో–ఆధార్ మంజూరులో భాగంగా గోవు ముక్కు వద్ద ఉన్న తేమ, ఒక్కో పశువుకు ఒక్కో తరహాలో ఉంటుందన్నారు. మనుషులకు చేతి వేలిముద్రలు ఎలా ఉంటాయో పశువుల ముక్కు వద్ద తేమ అదే తరహాలో విభిన్నంగా ఉంటుందన్నారు. ముక్కు వద్ద ఉన్న తేమను యాప్ ద్వారా స్కాన్ చేసి, పశువుల యజమాని ఆధార్‌కార్డుకు లింకు చేస్తామని చెప్పారు. తద్వారా పశువుకు గో–ఆధార్ గుర్తింపు కార్డును జారీ చేస్తున్నట్లు తెలిపారు. గో–ఆధా ర్ పూర్తి చేసిన తర్వాత పసుపు రంగులో ఒక ట్యాగును వాటి చెవికి వేస్తామని చెప్పారు. ఈ గో–ఆధార్ ద్వారా పశువులు తస్కరించినా, స్కానింగ్ ద్వారా గుర్తించవచ్చన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం ద్వారా పాడి పరిశ్రమలకు వచ్చే పథకాలను సులభతరంగా అర్హులకు అందించేందుకు ఈ పథకం దోహద పడుతుందన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద యాప్‌లో నమోదు చేస్తామని, యాప్ నమోదు విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా గో–ఆధార్ నమోదు ప్రక్రియను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీ ఉమా మహేశ్వరి, ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి, పశు వైద్యాధికారి డాక్టర వంశీ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో రైలు కిందపడి సత్యవేడు వాసి మృతి


బాలాజీ (ఫైల్)

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని ఆర్టీసీ రోడ్డులో నివశిస్తున్న బాలాజీ(46) తమిళనాడులోని కవరపేట రైల్వేస్టేషన్‌లో కదులుతున్న రైలు నుంచి కిందకు దిగుతూ బండి కిందపడి మృతి చెందాడు. బంధువుల కథనం మేరకు.. రెండు రోజుల క్రితం తన కుమార్తెను కళాశాలలో వదలి వచ్చేందుకు సత్యవేడు నుంచి విజయవాడలో వెళ్లాడు. బుధవారం రాత్రి విజయవాడలో చెన్నై ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. గురువారం సాయంత్రం చెన్నై ఎక్స్‌ప్రెస్ కవరపేటకు చేరడంతో కదులుతున్న రైలు దిగేందుకు ప్రయత్నించగా కాలు జారి రైలు కింద పడిపోయాడు. సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తిరుమలలో ఎర్రచందనం స్వాధీనం


కారులో ఎర్రచందనం దుంగలు

తిరుమల: తిరుమలలో 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఫారెస్ట్ రేంజర్ సుదర్శన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తిరుమలలోని శిలాతోరణం వద్ద ఓ కారు హల్‌చల్ చేసింది. వేగంగా వెళ్తున్న కారులో అక్రమంగా ఎర్రచందనం రవాణా అవుతున్నట్లు అటవీశాఖ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు కారును ఆపి తనిఖీలు చేపట్టారు. కారులోని వెనుక సీటులో గ్రేడ్ ఏకు చెందిన 20 ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయి. డ్రైవర్ తప్పించుకునే ప్రయత్నం చేయగా.. సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఎర్రచందనం దుంగలతో పాటు కారును సీజ్ చేశారు. స్మగ్లర్ తమిళనాడు వెన్నుపూరానికి చెందిన రమేష్‌గా గుర్తించారు.

ఇద్దరు ఎర్రస్మగ్లర్ల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి మంగళం : శ్రీవారిమెట్టు సమీపంలో మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్, డీఎస్పీలు జి.బాలిరెడ్డి, వి.శ్రీనివాస రెడ్డి, ఎండీ షరీఫ్ నేతృత్వంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ఐ విష్ణువర్దన్ కుమార్ బృందం గురువారం చంద్రగిరి మండలం, భాకరాపేట రేంజిలోని నాగపట్ల బీట్‌లో కూంబింగ్ చేపట్టారు. శ్రీవారిమెట్టుకు పడమర వైపునకు చేరుకునే సరికి ముగ్గురు స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారు. వీరిని హెచ్చరించి చుట్టుముట్టే సరికి ఒక వ్యక్తి దుంగను పడేసి పారిపోగా, మిగిలిన ఇద్దరిని అరెస్టు చేశారు. వారు మోసుకొస్తున్న మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఫీ తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు

- సమీక్ష నిర్వహించిన చెవిరెడ్డి
- స్వాగత తోరణాలు, విద్యుద్దీపాల ఏర్పాట్లపై సూచనలు


తుమ్మలగుంటలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

తిరుపతి రూరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచించారు. ఈ నెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లపై గురువారం ఈవో, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి నాడు ఉదయం 3.30 గంటల నుంచే వైకుంఠ ద్వారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రధాన ఆలయ ముఖద్వారంతో పాటు వైకుంఠ ద్వారాన్ని సువాసనలు వెదజల్లే పరిమళ భరిత పుష్పాలతో ఎంతో అందంగా అలంకరించాలన్నారు. ఇందుకోసం దేశ, విదేశాల నుంచి పుష్పాలు తీసుకువచ్చేలా చూడాలని ఆలయ సిబ్బందికి సూచించారు. ఆలయం ముందు సర్వదర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లలో భక్తులు ఆగకుండా ముందుకు కదులుతూ ఉండేలా చూడాలన్నారు. వీఐపీలు, వీవీఐపీలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్ గుండా అనుమతించి సామాన్య భక్తులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా గోవిందమాల ధరించిన భక్తులకు స్వామి దర్శనం ఆలస్యం కాకుండా చూడాలన్నారు. తుమ్మలగుంట గ్రామ శివార్లలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామస్తులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నిరంతరాయంగా అన్న ప్రసాదాల పంపిణీ

వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఉదయం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


ఆలయ గోపురాన్ని శుద్ధి చేస్తున్న ఆలయాధికారులు

తిరుపతి కల్చరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెల్లవారుజామున తిరుప్పావై సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, అర్చన, శ్రావణ తిరుమంజనం, శుద్ధి నిర్వహించారు. అనంతరం 6.30 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేశారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. తర్వాత భక్తులను ఉదయం 9.30 గంటల నుంచి దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఏపీ శ్రీనివాస దీక్షితులు, ఏఈఓ కె.మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

కూటమి నేతల అత్యుత్సాహం


రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న కేవీబీపురం సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు


కేవీబీపురం (వరదయ్యపాళెం): మండల కేంద్రమైన కేవీబీపురం పరిధిలోని కొత్తకాలనీలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని కోర్టు ఆంక్షలు ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో కూటమి నేతలు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ సీసీ రోడ్డు నిర్మాణానికి ఒత్తిడి చేస్తున్నారు. ఆ దిశగా సీసీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన సామగ్రిని అక్కడకు చేర్చడంతో ఈ విషయాన్ని గమనించిన స్థానిక సర్పంచ్ కరపారెడ్డి గిరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు వీరాపురం అయ్యప్ప స్థానికులతో కలిసి గురువారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కొత్తకాలనీ పరిధిలోని సర్వే నంబర్ 53లో 2008లో అప్పటి ప్రభుత్వం ఇళ్ల పట్టాలను పంపిణీ చేసింది. తాజాగా గత ప్రభుత్వంలో మరికొందరి నిరుపేదలకు అదే ప్రాంతంలో ఇళ్ల పట్టాలను జారీ చేసింది. అయితే పట్టాలు పొందిన పేదలు ఇళ్ల నిర్మాణానికి సిద్ధం కాగా ఈ ఏడాది ఏప్రిల్‌లో కూటమి నేతలు ఉద్దేశపూర్వకంగా ఇళ్లు నిర్మించకూడదని కోర్టును ఆశ్రయించి కుట్ర చేశారు. ఆ సమయంలో కోర్టు స్టే విధించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని తీర్పునిచ్చింది. అయితే ఆ ప్రాంతానికి చెందిన ఓ కూటమి నేత సీసీ రోడ్డు నిర్మాణానికి కొద్దిరోజులుగా తెర వెనుక ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని స్థానికులు రెవెన్యూ వారికి ఫిర్యాదు చేశారు. చాలా కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుంటే అభ్యంతరం వ్యక్తం చేసిన కూటమి నేతలు రోడ్డు ఎలా నిర్మిస్తారని, అదే జరిగితే తాము అడ్డుకోవడం ఖాయమని రెవెన్యూ వారికి తేల్చి చెప్పారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మునిరత్నం కోర్టు వివాదంలో ఉన్న భూమిలో రోడ్డు పనులు చేపట్టవద్దని, అలా చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని వారిని హెచ్చరిస్తామని తెలిపారు.

పింఛన్లపై తనిఖీలు చేయండి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: నకిలీ సర్టిఫికెట్లతో జిల్లాలో పలువురు పింఛన్లు పొందుతున్నారని, వాటిపై తనిఖీలు చేయాలని ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చాయని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా సదరన్ సర్టిఫికెట్లు జారీలో అవకతవకలు జరిగినట్లు తెలుస్తోందన్నారు. ఈ క్రమంలో వాటిని తనిఖీలు చేయాలని ఆదేశించారు. మరోవైపు ఈ నెల చివరికల్లా మంచానికి పరిమితం అయి రూ.15 వేలు పింఛన్లు పొందుతున్నట్లు ఉన్న లెక్కల ప్రకారం తనిఖీలు చేయాల్సి ఉందని చెప్పారు. ఆ తర్వాత విభిన్న ప్రతిభావంతుల పింఛన్లు ఏప్రిల్ చివరికల్లా తనిఖీలు చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా నకిలీ సదరన్ సర్టిఫికెట్లు తీసుకున్నవారితోపాటు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆ దిశగా డీఆర్‌డీఏ బృందం పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జుబేదా, డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభ, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి నారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిని సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లు బాధ్యతగా పనిచేయాలి


జిల్లా వైద్యాధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

తిరుపతి తుడా: ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు బాధ్యతగా పనిచేయాలని, వారు చేసే రక్త పరీక్షలు ప్రజల ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి బాలకృష్ణనాయక్ పేర్కొన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో ఆయన ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని నిర్ణయించే కీలక బాధ్యతలు టెక్నీషియన్ల చేతుల్లో ఉన్నాయని, బాధ్యతగా వ్యవహరించి రాష్ట్రంలో జిల్లాను ఉన్నత స్థాయికి చేర్చాలని కోరారు. టెక్నీషియన్లు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ యూనియన్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి శ్రీనివాసరెడ్డి, డీఐఓ శాంత కుమారి, డీపీఎంఓ శ్రీనివాసులు, డెమో బాబు, నెహ్రూ రెడ్డి, ఎస్ఓ నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.